

చీనీ టన్ను రూ.21 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.21 వేలు పలికాయి.



కౌలు రైతుకూ సర్కారు భరోసా

కౌలు రైతులకు జగన్ సర్కారు పంట సాగు హక్కు పత్రం (సీసీఆర్‌సీ) కార్డులు అందించి భరోసా కల్పిస్తోంది. 8లో

గరిష్ఠం/కనిష్ఠం 35.9°/22.4°

జిల్లా అంతటా మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలి వేగం స్వల్పంగా పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలిక పాటి జల్లులు పడ్డాయి.

న్యూస్‌రీల్

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ కేశవనాయుడు

యాడికి: జగనన్న కాలనీల్లో చేపట్టిన గృహ నిర్మాణాలను వేగవంతం చేసి డిసెంబర్ లోపు పూర్తి చేయాలని లబ్ధిదారులకు హౌసింగ్ పీడీ కేశవనాయుడు సూచించారు. యాడికిలోని చందన రహదారిలో ఉన్న జగనన్న లేఅవుట్‌లో చేపట్టిన గృహ నిర్మాణాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. లబ్ధిదారులతో మాట్లాడుతూ.. పేదల సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం నివేశన స్థలాలు ఇచ్చి, గృహ నిర్మాణానికి రూ.1.80 లక్షలు అందజేస్తోందన్నారు. వీటికి తోడు రాయితీతో సిమెంట్, ఇసుక, స్టీల్‌ను సమకూరుస్తోందన్నారు. డ్వాక్రా గ్రూపులో సభ్యురాలిగా ఉంటే గృహ నిర్మాణానికి రూ.35 వేల రుణాన్ని బ్యాంకుల ద్వారా సమకూరుస్తున్నట్లు గుర్తు చేశారు. ఈ సౌలభ్యాలను సద్వినియోగం చేసుకుని గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ అనూరాధ, తహసీల్దార్ అలెగ్జాండర్, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, ఈఓఆర్డీ వెంకటేశ్వర్లు, పంచాయతీ ఈఓ ఎర్రిస్వామి, హౌసింగ్ ఏఈ ప్రశాంత్‌కుమార్ పాల్గొన్నారు.

ఐదు రోజులు వర్షాలు లేవు

అనంతపురం అగ్రికల్చర్ : జిల్లాలో రానున్న ఐదు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం లేదని రేకులకుంటలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సహదేవరెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త అశోక్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నీట మునిగి విద్యార్థి మృతి



ఉజ్వల్ మృతదేహం

పావగడ: స్థానిక షిర్డీ సాయిబాబా ఆలయ సమీపంలో ఉన్న చాకలి కుంట (చెరువు)లో పడి ఓ విద్యార్థి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. మడకశిరకు చెందిన రమేష్ కుటుంబసభ్యులతో కలసి పావగడలోని చాకలికుంట వద్ద అద్దె ఇంట్లో నివాసముంటూ గృహ నిర్మాణాలకు ఇటుకలు, రాళ్లు సరఫరా చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కుమారుడు ఉజ్వల్ (13) అనంతపురంలోని శ్రీచైతన్య పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఇటీవల ఇంటికి వచ్చిన ఉజ్వల్ మంగళవారం ఉదయం 11 గంటలకు తన స్నేహితులతో కలసి చాకలికుంట వద్ద ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో పడ్డాడు. లోతుగా ఎక్కువగా ఉండడంతో నీట మునిగాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు, పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని దాదాపు రెండు గంటల పాటు శ్రమించి బాలుడి మృతదేహాన్ని వెలికి తీశారు. ఎస్‌ఐ గురుమూర్తి కేసు నమోదు చేశారు.

30న జాబ్‌మేళా




అనంతపురం: జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఈ నెల 30న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి కళ్యాణి ఓ ప్రకటనలో తెలిపారు. గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్‌లో 250 ఖాళీలు ఉన్నాయన్నారు. నెలకు రూ.13,500 నుంచి రూ.15,500 వరకు జీతభత్యాలు కల్పిస్తారన్నారు. పీఎఫ్, ఈఎస్‌ఐ, బోనస్, గ్రాట్యుటీ, ఉచిత భోజన సదుపాయాలు ఉంటాయని పేర్కొన్నారు. 18 నుంచి 30 ఏళ్లలోపు వయసు కలిగి, పదోతరగతి, ఇంటర్మీడియెట్, ఐటీఐ, డిప్లొమా, బీటెక్ (మెకానికల్ ఫ్రెషర్స్) కోర్సు పూర్తి చేసిన వారు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు జిరాక్స్ పత్రాలు, ఆధార్, బ్యాంకు పాసు బుక్ జిరాక్స్, 2 పాస్‌పోర్టు సైజు ఫొటోలతో అనంతపురం కోర్టురోడ్డులోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో జరిగే జాబ్‌మేళాకు హాజరు కావాలని కోరారు. ఎంపికైన వారు తిరుపతి జిల్లా నాయుడుపేటలో పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు.

రూరల్ ఎస్‌ఆర్‌గా వెంకటనారాయణ

అనంతపురం టౌన్: వైఎస్సార్ జిల్లాలో సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న వెంకటనారాయణను అనంతపురం రూరల్ సబ్ రిజిస్ట్రార్‌గా నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న సబ్ రిజిస్ట్రార్ యూనస్‌ను అనంతపురం ఆర్‌ఓ జాయింట్-2 సబ్ రిజిస్ట్రార్‌గా నియమించారు.

ఇక ఈ- స్టాంపింగే



- శింగనమలలో రైతు సంజీవయ్య (పేరు మార్చడమైనది) పేరుపై రూ.100 నాన్ జ్యుడీషియల్ స్టాంపు కొని, ఆయన పొలాన్ని వేరొకరికి విక్రయించినట్లు ఫోర్జరీ సంతకాలతో అగ్రిమెంట్ తయారు చేశారు. విషయం తెలుసుకున్న రైతు ఆ అగ్రిమెంట్‌లోని సంతకం తనది కాదని అధికారుల వద్ద ఏకరువు పెట్టినా ఎవ్వరూ పట్టించుకోలేదు. చివరకు కోర్టులో దావా వేశాడు. ఐదు సంవత్సరాల పాటు కోర్టులో విచారణ జరిగిన తర్వాత రైతు సంజీవయ్యకు న్యాయం జరిగింది.

- క్రయవిక్రయాలు పారదర్శకం
- నూతన విధానానికి శ్రీకారం చుట్టిన రిజిస్ట్రేషన్ శాఖ
- మ్యాన్యువల్ విధానంలో స్టాంపుల కొనుగోలు బంద్
- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ- స్టాంపింగ్ కేంద్రాలు

అనంతపురం టౌన్: నాన్ జ్యుడీషియల్ స్టాంపుల విక్రయాల్లో అవకతవకలను అరికట్టి, పారదర్శక విక్రయాలు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ-స్టాంపింగ్ విధానాన్ని ప్రవేశపెట్టింది. పాత తేదీలతో నాన్ జ్యుడీషియల్ స్టాంపులను కొనుగోలు చేసి వాటి ద్వారా నకిలీ అగ్రిమెంట్లు సృష్టించుకునే విధానానికి పూర్తి స్థాయిలో చెక్ పెట్టినట్లు అయింది. ఇకపై ఏ రోజుకారోజు అనే నినాదంతో ఈ-స్టాంపుల విక్రయాలను చేపట్టింది. స్టాంపుల విక్రయాల కోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందించింది. ఈ విధానంతో స్టాంపుల విక్రయాల్లో ఎలాంటి అక్రమాలకు తావుండదు.

21 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ- స్టాంపింగ్ కేంద్రాలు

ఉమ్మడి జిల్లాలో మొత్తం 21 (అనంతపురం జిల్లాలో 12, శ్రీసత్యసాయి జిల్లాలో 9) సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ- స్టాంపింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే 50 శాతానికిపైగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కేంద్రాలను ఏర్పాటు చేసి వాటి ద్వారా నాన్ జ్యుడీషియల్ ఈ-స్టాంపుల విక్రయాలను చేపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రూ.100 స్టాంపుల విక్రయాలను పూర్తిస్థాయిలో బంద్ చేశారు. వాటి సరఫరాను సైతం స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు నిలిపివేశారు. వినియోగదారులు సైతం ఈ -స్టాంపుల వినియోగంపై దృష్టి పెట్టాలని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు సూచిస్తున్నారు. పారదర్శకంగా ఉండే ఈ-స్టాంపుల ద్వారా స్థిరాస్తుల క్రయ విక్రయాలు చేపట్టాలని కోరుతున్నారు.

ఈ- స్టాంపింగ్ వెండర్లకు లైసెన్సులు

ఈ- స్టాంపుల విక్రయాల కోసం జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం ఉన్న వెండర్ల(విక్రయదారుల)తోపాటు కొత్తవారు సైతం ఈ- స్టాంపింగ్ వెండర్ లైసెన్సుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి వారికి లైసెన్సులను సైతం అందజేయనున్నారు. ఇప్పటికే అనంతపురం నగరంతో పాటు హిందూపురం, పుట్టపర్తి కేంద్రాల్లో ఈ స్టాంపింగ్ వెండర్లకు లైసెన్సులు మంజూరు చేశారు. పదో తరగతి, ఆ పైన విద్యార్హతతోపాటు కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న నిరుద్యోగ యువత ఈ- స్టాంపింగ్ వెండర్ కోసం దరఖాస్తు చేసుకుంటే నిర్దేశించిన సమయంలోగా లైసెన్సులు జారీ చేయనున్నారు.

అవకతవకలకు చెక్



“నాన్ జ్యుడీషియల్ స్టాంపుల విక్రయాల్లో అవకతవకలు అరికట్టేందుకు ప్రభుత్వం ఈ- స్టాంపింగ్ విధానం ప్రవేశపెట్టింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 10కిపైగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ- స్టాంపు విధానం అమల్లో ఉంది. మిగిలిన కార్యాలయాల్లో సైతం ఈ నెలాఖరులోపు ఈ-స్టాంపింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆయా జిల్లా రిజిస్ట్రార్లకు ఆదేశాలు జారీ చేశాం. రానున్న రోజుల్లో మ్యానువల్ స్టాంపుల విక్రయాలు పూర్తి స్థాయిలో బంద్ అయ్యే అవకాశం ఉంది. వినియోగదారులు సైతం పారదర్శకంగా ఉండే ఈ- స్టాంపుల కొనుగోలుపై దృష్టి సారించాలి.

– మాధవి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ

పేద పిల్లల చదువుకు భరోసా

- నేడు నాలుగో విడత 'అమ్మఒడి' నిధుల విడుదల
- జిల్లాలో 2,13,394 మంది విద్యార్థులకు ప్రయోజనం



రాప్తాడు రూరల్: ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో చదువు అంటే చులకన భావం ఉండేది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత పరిస్థితి మారింది. ఇందుకు ప్రధాన కారణం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తీసుకొచ్చిన సంస్కరణలేనని విద్యావేత్తలు చెబుతున్నారు. ముఖ్యంగా మనబడి నాడు-నేడు లాంటి కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. పేదలకు తమ పిల్లలను బడులకు పంపడం భారం కాకూడదనే ఉద్దేశంతో 'జగనన్న అమ్మఒడి'కి శ్రీకారం చుట్టారు. ఏడాదికి ఒక విద్యార్థికి రూ.15 వేలు చొప్పున అందిస్తున్నారు. ఈ మొత్తాన్ని తల్లి ఖాతాలో జమ చేస్తున్నారు. 2020 జనవరి 26న ఈ పథకం తొలిసారి ప్రారంభమైంది. వరుసగా మూడేళ్లు ఈ పథకం అమలు చేశారు. తాజాగా నాల్గో ఏడాది 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి బుధవారం రాష్ట్రస్థాయిలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. రూ.15 వేలలో పాఠశాల, మరుగుదొడ్ల నిర్వహణ కోసం రూ.2 వేలు మినహాయిస్తారు. తక్కిన రూ.13 వేలు తల్లుల ఖాతాల్లో జమ చేయనున్నారు. జిల్లాస్థాయిలో అనంతపురంలోని కేఎస్‌ఆర్ బాలికల జూనియర్ కళాశాల వేదికగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. జిల్లాలో మొత్తం 2,13,394 మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది. వీరి కోసం రూ.277.41 కోట్లు మంజూరు చేసింది.

నాణ్యమైన విద్యుత్

- కొత్తగా 37 సబ్‌స్టేషన్లు
- 33/11కేవీ సబ్‌స్టేషన్లకు రూ.92.5 కోట్లు వెచ్చిస్తున్న సర్కారు
- వీటిలో నవంబర్ నాటికి 32 సబ్‌స్టేషన్లు అందుబాటులోకి
- బ్రేక్‌డౌన్స్, రెవెన్యూ లాస్‌లు ఇక కనుమరుగు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: రాష్ట్రంలో జగన్ సర్కారు చేపట్టిన విద్యుత్ సంస్కరణలు ఫలిస్తున్నాయి. విద్యుత్ విభాగంలో చేపట్టిన అభివృద్ధి పనుల ఫలితమా అని కోతల్లేని కరెంటు అందుతోంది. గతంలో వేసవి వచ్చేసరికి కరెంటు ఎప్పుడొస్తుందో, ఎప్పుడు పోతుందో దిక్కు తెలియని పరిస్థితి. గడిచిన మూడేళ్లుగా ఈ పరిస్థితికి పూర్తిగా చెక్ పడింది. అవసరమైనన్ని ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి వ్యవసాయానికి ఎక్కడా ఇబ్బంది రాకుండా చూశారు. తాజాగా కరెంటు వ్యవస్థలోనే అత్యంత ప్రధానమైన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణం చేపట్టారు.

నవంబర్ నాటికి 32 సబ్‌స్టేషన్లు

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా కొత్తగా 37 విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరయ్యాయి. ఇందులో 32 సబ్‌స్టేషన్ల పనులు ప్రారంభించారు. కొన్ని చోట్ల రైతులు స్థలాలు ఉచితంగా ఇచ్చారు. మరికొన్ని చోట్ల ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో సబ్‌స్టేషన్ నిర్మాణానికి రూ.2.5 కోట్ల నిధులు వ్యయం చేస్తున్నారు. ఈ లెక్కన 37 సబ్‌స్టేషన్లకు రూ.92.5 కోట్లు ఖర్చు చేస్తున్నారు. నవంబర్ నాటికి ఇవి అందుబాటులోకి వస్తాయి. అతిపెద్ద విద్యుత్‌లైన్ వ్యవస్థ కలిగి ఉన్న ఉమ్మడి అనంతపురానికి ఈ సబ్‌స్టేషన్లు మరింత మెరుగైన, నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ఉపయోగపడనున్నాయి. గతంలో ఒకేసారి ఇంత పెద్దస్థాయిలో సబ్‌స్టేషన్ల నిర్మాణం ఎప్పుడూ జరగలేదు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో రూ.1,600 కోట్లకు పైగా వెచ్చించి విద్యుత్ సంస్కరణలు చేపట్టిన విషయం తెలిసిందే.



శెట్టూరు మండలం ములకలేడు వద్ద సబ్ స్టేషన్ నిర్మాణానికి సిద్ధంగా ఉంచిన విద్యుత్ పరికరాలు

కొత్త సబ్‌స్టేషన్ల రాకతో...

- విద్యుత్ సరఫరాలో అవాంతరాలు అధిగమించవచ్చు.
- తరచూ బ్రేక్‌డౌన్స్ వంటి ఇబ్బందులను అరికట్టవచ్చు.
- వ్యవసాయానికి లోవోల్టేజీ లేకుండా మెరుగైన కరెంటు ఇవ్వొచ్చు.
- సబ్‌స్టేషన్లు ఎక్కువగా ఉండటం వల్ల విద్యుత్ నష్టాలను (రెవెన్యూ లాస్) అరికట్టవచ్చు.
- ట్రాన్స్‌ఫార్మర్లు, కండక్టర్లు వంటివి కాలిపోవడానికి వీలుండదు.
- విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు ఉండవు.

విద్యుత్ సబ్‌డివిజన్ల వారీగా కొత్త సబ్‌స్టేషన్లు ఇలా

డివిజన్	సబ్‌స్టేషన్లు
అనంతపురం టౌన్	04
అనంతపురం రూరల్	04
హిందూపురం	06
కదిరి	06
గుత్తి	07
కళ్యాణదుర్గం	08
అనంతపురం	02

మెరుగైన సరఫరా వ్యవస్థ

విద్యుత్ సరఫరా వ్యవస్థలో సబ్‌స్టేషన్లే కీలకం. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 262 సబ్‌స్టేషన్లు ఉండగా.. అదనంగా 37 వస్తున్నాయి. వీటిలో నవంబర్ నాటికి 32 అందుబాటులోకి వస్తాయి. ముఖ్యంగా వ్యవసాయ విద్యుత్ సరఫరాకు లోవోల్టేజీ, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడం వంటి సమస్యలు ఉత్పన్నం కావు. రెవెన్యూ నష్టాలు ఇక ఉండవు. రైతులకు ప్రయోజనం ఉంటుంది.

– సురేంద్ర, ఎస్ఈ, ఎస్పీడీసీఎల్

సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి పనులు

- పరిశ్రమల యాజమాన్యాలకు కలెక్టర్ గౌతమి సూచన

అనంతపురం అర్బన్: పరిశ్రమలు కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులతో అభివృద్ధి పనులు చేపట్టాలని కలెక్టర్ గౌతమి సూచించారు. అధికారులతో సమన్వయం చేసుకుని సామాజిక మార్పులకు ఉపయోగపడే విధంగా వినూత్న ఆలోచనలతో ప్రణాళికాబద్ధంగా పనులు చేయాలన్నారు. కలెక్టర్ మంగళవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సీఎస్ఆర్ కార్యక్రమాల అమలుపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో చేపట్టనున్న పనుల ప్రణాళికపై సమీక్షించారు. అభివృద్ధి పనులకు సీఎస్ఆర్ కింద ఖర్చు చేయనున్న వివరాలను పరిశ్రమల ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు.

వెనుకబడిన ప్రాంతాపై దృష్టి

పరిశ్రమల వాటి చుట్టుపక్కల ప్రాంతాల్లోనే కాకుండా జిల్లావ్యాప్తంగా వెనుకబడిన ప్రాంతాలను గుర్తించి సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని పరిశ్రమలు ఇతర ప్రాంతాల్లో కాకుండా కచ్చితంగా ఇదే ప్రాంతానికి అధిక ప్రాధాన్యతనిస్తూ పనులు చేపట్టాలని సూచించారు. సీఎస్ఆర్ కింద గుర్తించిన పరిశ్రమలే కాకుండా మిగిలిన పరిశ్రమలు, ఇతర కంపెనీలు కూడా అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కూడేరు, గుత్తి ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులకు పెండింగ్‌లో ఉన్న సిమెంట్‌ను సత్వరమే సరఫరా చేయాలని పెన్నా కంపెనీ ప్రతినిధులను ఆదేశించారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ గౌతమి

సంక్షేమాభివృద్ధి లక్ష్యంగా పనులు

సంక్షేమాభివృద్ధి లక్ష్యంగా పనులు జరగాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లోని ప్రజలు, ప్రజా ప్రతినిధులు కోరినప్పుడు సీఎస్ఆర్ కార్యక్రమం కింద ఎలాంటి పనులు చేపట్టేందుకైనా తన ఆమోదం పొందేలా చర్యలు తీసుకోవాలని సీపీఓ అశోక్‌కుమార్‌రెడ్డిని ఆదేశించారు. సీఎస్ఆర్ పనులను తెలుసుకునేందుకు ఆయా పరిశ్రమలను సందర్శించేందుకు షెడ్యూల్ సిద్ధం చేయాలని పరిశ్రమల శాఖ జీఎం నాగరాజురావును కలెక్టర్ ఆదేశించారు.

పరిశ్రమల అభివృద్ధికి సహకారం

పరిశ్రమల అభివృద్ధికి తన వంతు సంపూర్ణ సహకారం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. కొత్తగా ఏర్పాటు చేసే పరిశ్రమలను జిల్లా యంత్రాంగం ద్వారా పూర్తిస్థాయిలో ప్రోత్సహిస్తామన్నారు. పరిశ్రమల అభివృద్ధికి సూచనలు చేయాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ భాగ్యరాజ్, డీఎంహెచ్ఓ వీరబ్బాయి, కాలుష్య నియంత్రణ శాఖ ఈఈ కిషోర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కేశవులు, అర్జా స్టీల్స్ ఎండీ శ్రీధర్ కృష్ణమూర్తి, పెన్నా, సాగర్, అల్ట్రాటెక్ సిమెంట్, సప్తగిరి క్యాంపర్, సిప్లాన్ డ్రగ్స్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

దోచుడు.. దాచుడే మీ విధానం

- గొందిరెడ్డిపల్లి గుట్టకు గుండు మీ పనే
- 25 ఏళ్లలో ప్రజలకు ఏమి ఒరగబెట్టారు?
- అది బస్సు యాత్ర కాదు.. తుస్సు యాత్ర
- పరిటాల సునీతపై ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఫైర్

రాప్తాడురూరల్: పరిటాల కుటుంబానిది దోపిడీ విధానమని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ధ్వజమెత్తారు. దోచుకోవడం.. దాచుకోవడం తప్ప వారికి ప్రజల సమస్యలు పట్టవన్నారు. పాతికేళ్లలో ఏమి ఒరగబెట్టారో తెలిపి.. మళ్లీ వస్తే ఏమి చేస్తారో ప్రజలకు చెప్పాలని మాజీ మంత్రి పరిటాల సునీతకు హితవు పలికారు. మంగళవారం అనంతపురంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. సంక్షేమ పథకాలు పొందడానికి అవసరమైన సర్టిఫికెట్లు లేక ఇబ్బంది పడుతున్న వారిని గుర్తించి 11 రకాల సేవలను సేవా రుసుము లేకుండా ఉచితంగా అందించేందుకు జగనన్న సురక్ష పేరుతో ప్రతిష్టాత్మకమైన కార్యక్రమానికి ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారన్నారు. జూలై 1 నుంచి 30 వరకు జరిగే ఈ కార్యక్రమంలో రాష్ట్రస్థాయి నుంచి జిల్లా, మండల, గ్రామఅధికారులు, ప్రజాప్రతినిధులు క్యాంపులు నిర్వహించి, ప్రజలకు అక్కడికక్కడే టోకెన్ల వారీగా పిలిపించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారన్నారు.

దోపిడీకి అంబాసిడర్ సునీత

దోపిడీకి బ్రాండ్ అంబాసిడర్ మహానటి పరిటాల సునీత అని తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి విమర్శించారు. మీ తమ్ముళ్లకు చెరువులు, కొండలు అప్పగించారన్నారు. సిద్ధార్థ కన్‌స్ట్రక్షన్స్ చేసిన రైల్వే పనుల కోసం జంగాలపల్లి చెరువు మొత్తం గుంతలు పెట్టారన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి. చిత్రంలో పైలా నరసింహయ్య

గొందిరెడ్డిపల్లి గుట్టకు గుండు చేసింది నీవే తల్లీ అని అన్నారు. సిద్ధార్థ కన్‌స్ట్రక్షన్స్ నడుపుతున్న నీ కొడుకులు ఇక్కడి నుంచి మట్టిని తీసుకుపోయి రూ.80 కోట్లకు బిల్లులు పెట్టుకున్నారని ఆరోపించారు. ఆలమూరు కొండను మరో తమ్ముడికి అప్పగించావన్నారు. మీరు చేసిన దోపిడీని ప్రజలు మరిచిపోలేదన్నారు.

సంపదను పంచడం మా విధానం

సంపదను సృష్టించి.. ప్రజలకు పంచడం తమ విధానమని ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి స్పష్టం చేశారు. అందుకు నిదర్శనమే 'అమ్మ డెయిరీ' అని పేర్కొన్నారు. తమ చిత్తశుద్ధిని శంకించాలని చూస్తే భగవంతుడే మీకు శిక్ష వేస్తాడన్నారు. తమది నిస్వార్థ ప్రజాసేవ అన్నారు.

బస్సుకు డీజిల్ వేయించుకోండి

బస్సు యాత్రలో భాగంగా పేరూరుకు వెళ్లినప్పుడు వీధిలైట్లు వెలగలేదని, తానే వేయిస్తానని అంటున్న పరిటాల సునీత.. ముందు మీ బస్సుకు డీజిల్ వేయించుకుని యాత్ర చేపట్టండి అంటూ ప్రకాష్‌రెడ్డి ఎద్దేవా చేశారు. అది బస్సు యాత్ర కాదని.. తుస్సు యాత్ర అని అన్నారు. తనపై అసందర్భ ప్రేలాపనలు సరికాదన్నారు. గత ప్రభుత్వంలో మైనింగ్ దొంగలు, ఉపాధి హామీ దొంగలు, నీరు-చెట్టు దొంగలు, ప్రాజెక్టుల దొంగలు మీరేనని మండిపడ్డారు. రియల్ ఎస్టేట్ పేరుతో ప్రభుత్వ భూములను ఆక్రమించారని, మాజీ సైనికుల పేరుతో ప్రభుత్వ భూములు కబ్జా చేశారని ధ్వజమెత్తారు.

సామూహిక వివాహాలకు భారీగా వసూలు

ఎంతోమంది అమాయకుల తాళిబొట్లు తెంపిన కుటుంబం మీది అని పరిటాల సునీతపై ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి మండిపడ్డారు. పెళ్లిళ్లు చేయాలంటూ ఎవరూ మీవద్దకు రాలేదన్నారు. హైదరాబాద్ నుంచి జూనియర్ ఆర్టిస్టులను పిలిపించి పెళ్లిళ్లు చేసినట్లు డ్రామా చేశారన్నారు. ఇందుకోసం ధర్మవరం, ఇతర ప్రాంతాల్లో భారీగా డబ్బు వసూలు చేశారని ఆరోపించారు. కరోనా సమయంలో పరిటాల సునీత హైదరాబాద్‌లో కూర్చుని జూమ్ కాన్ఫరెన్స్‌లు పెడితే, తాము మాత్రం ప్రజలతోనే ఉన్నామని చెప్పారు. వారికి అండగా నిలబడి దాదాపు రూ.4 కోట్లు ఖర్చు పెట్టి సహాయక కార్యక్రమాలు చేపట్టామన్నారు. 2022లో గడువు ముగిసిన తన స్టిక్కర్‌ను జిరాక్స్ చేయించుకుని జులాయిలు తమ వాహనానికి అతికించుకుని తిరిగితే తనకేం సంబంధమని ప్రశ్నించారు. పరిటాల రవి కార్మిక మంత్రిగా ఉన్నప్పుడే రామగిరి బంగారు గనులు మూసేశారన్నారు. తాను ఎమ్మెల్యే అయిన తర్వాత తెరిపించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

బస్సు యాత్ర ఫ్లాప్ ఫ్రస్ట్రేషన్‌తోనే..

బస్సు యాత్ర అట్టర్‌ఫ్లాప్ కావడంతో టీడీపీ నాయకులు ఫ్రస్ట్రేషన్‌తో అధికార పార్టీ ఎమ్మెల్యేలు, నాయకుల వ్యక్తిత్వహననానికి దిగుతున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య విమర్శించారు. 600 హామీలతో అధికారం చేపట్టి ఒక్కటీ అమలు చేయని చంద్రబాబు.. ఇప్పుడు ఓట్ల కోసం మరోమారు ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. 'అమ్మ' డెయిరీ ఏర్పాటును జీర్ణించుకోలేక ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డిపై అభాండాలు వేస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో రాప్తాడు వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, బీసీ సెల్ నేత ఆదినారాయణ, వైఎస్సార్‌సీపీ రాప్తాడు మండల కన్వీనర్ జూటూరు శేఖర్, కక్కలపల్లి కాలనీ ఎంపీటీసీ సభ్యుడు వడ్డే శీనా పాల్గొన్నారు.

6 వేల ఎకరాల్లో పండ్ల మొక్కల సాగుకు శ్రీకారం

అనంతపురం టౌన్: ఉపాధి హామీ పథకంలో గ్రామీణ ప్రాంతాల్లోని ఆరు వేల ఎకరాల మెట్ట భూముల్లో పండ్ల మొక్కల సాగుకు శ్రీకారం చుట్టినట్లు జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్టు డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా ఐదు ఎకరాల్లోపు మెట్ట భూములున్న రైతుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. అందులో భాగంగానే తొలివిడతలో 4 వేల ఎకరాల్లో పండ్ల మొక్కల సాగు కోసం కలెక్టర్ నివేదికను ఆమోదించి మంజూరు చేసినట్లు తెలిపారు. రెండో విడతలో సైతం మరో 2వేల ఎకరాల్లో పనులు చేపట్టేందుకు పరిపాలన అనుమతుల కోసం ఉన్నతాధికారులకు పంపినట్లు తెలిపారు.

మరో 2 సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు

అనంతపురం టౌన్: రిజిస్ట్రేషన్ సేవలను ప్రజలకు మరింతగా చేరువ చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది. అందులో భాగంగానే సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు అందించేందుకు చర్యలు చేపట్టింది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 40 సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేసేందుకు చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే మరో 2 సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేపట్టాలని తాజాగా ఉత్తర్వులను జారీ చేసినట్లు జిల్లా రిజిస్ట్రార్ నాగభూషణం తెలిపారు. తాడిపత్రి సబ్ రిజిస్ట్రార్ పరిధిలోని పులిప్రొద్దుటూరు, చల్లవారిపల్లి సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు అందించేలా ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. జూలై 1 నుంచి ఈ రెండు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ సాగనుంది.

కౌలు రైతుకూ సర్కారు భరోసా

- 3,800 మంది కౌలు రైతులుగా గుర్తింపు
- ఇప్పటికే 2 వేల సీసీఆర్ కార్డులపంపిణీ
- మిగతా వారికి జూలై మొదటి వారంలో..
- పంట రుణాలు, రైతుభరోసా వర్తింపు



కౌలు రైతులకు జారీ చేసిన సీసీఆర్ కార్డులు

అనంతపురం అగ్రికల్చర్: స్వంత భూమి లేక తోటి రైతుల భూములను తీసుకుని పంట సాగు చేసుకునే 'కౌలు' రైతుకు కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు భరోసా ఇస్తోంది. కౌలుకు చేసే సాగుదారులను కూడా రైతులుగా గుర్తించి కొన్ని హక్కులు కల్పిస్తోంది. ఆర్‌బీకే వేదికగా భూయజమాని, సాగుదారుల మధ్య 11 నెలల కాలానికి అవగాహనతో కూడిన అగ్రిమెంట్ వర్తించేలా పంట సాగు హక్కు పత్రం (సీసీఆర్‌సీ) కార్డు జారీ చేస్తోంది. సీసీఆర్‌సీ కార్డు తీసుకున్న సాగుదారులను కౌలు రైతులుగా అధికారికంగా గుర్తించి వారికి ప్రభుత్వం నుంచి కొన్ని ప్రయోజనాలు వర్తింపజేస్తోంది. రెవెన్యూ, వ్యవసాయశాఖ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నాయి. దీంతో చాలామంది కౌలు రైతులకు ప్రభుత్వం నుంచి కొంత వరకు ఉపశమనం లభిస్తోందని చెబుతున్నారు. ఈ క్రమంలో ఈ ఏడాది 2,970 మంది కౌలు రైతులను గుర్తించి సీసీఆర్‌సీ కార్డులు జారీ చేయాలని ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యానికి మించి 3,800 మంది కౌలుదారులను గుర్తించారు. జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ప్రత్యేక దృష్టి సారించడంతో లక్ష్యానికి మించి కౌలుదారులను గుర్తించినట్లు చెబుతున్నారు. అందులో ఇప్పటి వరకు 2 వేల మంది కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు జారీ చేశారు. మిగతా వారికి జూలై మొదటి వారంలో పంపిణీ చేయనున్నారు. ఇన్‌పుట్‌సబ్సిడీ, పంటల బీమా, పంట రుణాల మంజూరు, సున్నావడ్డీ రాయితీ, ఇతరత్రా పంట నష్టం, అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల కౌలు రైతులకు వైఎస్సార్ రైతు భరోసా కూడా వర్తించేలా నిబంధనలు రూపొందించారు.

ఉరవకొండ డివిజన్‌లో అధికం..

ఉరవకొండ వ్యవసాయ సబ్‌డివిజన్‌లో 648 లక్ష్యం కాగా ఇప్పటి వరకు 558 మందికి సీసీఆర్‌సీ (కౌలు రైతు) కార్డులు ఇచ్చారు. గుత్తి సబ్ డివిజన్‌లో 561 మందికి గానూ 459 మంది, అనంతపురం డివిజన్‌లో 460 మందికి గానూ 271 మంది, తాడిపత్రి డివిజన్‌లో 467 మందికి గానూ 348 మంది, రాయదుర్గం డివిజన్‌లో 380 మందికి గానూ 165 మంది, కళ్యాణదుర్గం డివిజన్‌లో 454 మందికి గానూ 197 మంది కౌలుదారులకు కార్డులు పంపిణీ చేశారు. అత్యధికంగా ఉరవకొండ మండలంలో 285 లక్ష్యం కాగా 198 మందికి పంపిణీ చేశారు. ఆ తర్వాత వజ్రకరూరు, పామిడి, గుత్తి, నార్పల, పెద్దపప్పూరు, విడపనకల్లు, పెద్దవడుగూరు మండలాల్లో కౌలుదారులు అధికంగా ఉండగా... యాడికి, బొమ్మనహాళ్, డి.హీరేహాళ్, యల్లనూరు మండలాల్లో 68 చొప్పున సీసీఆర్‌సీ కార్డులు ఇవ్వాలని లక్ష్యం పెట్టుకోగా... అంతకు మించి చేస్తున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలు, రాయితీల లబ్ధి కౌలు రైతులకు వర్తించేలా సీసీఆర్ కార్డుల పంపిణీ ప్రక్రియగా కొనసాగిస్తున్నట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి (డీఏవో) యు.ఉమామహేశ్వరమ్మ తెలిపారు. భూయజమానులు, బ్యాంకర్లతో చర్చించి జూలై, ఆగస్టులో పంట రుణాలతో పాటు ఇతరత్ర ప్రభుత్వ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గుత్తి కొండపై వ్యక్తి మృతదేహం

గుత్తి: గుత్తి కొండలోని కొత్తపేట వైపు ఉన్న గుర్రపు కొండలో చెట్ల పొదల కింద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. దాదాపు రెండు నెలల క్రితమే గొర్రెల కాపరులు గుర్తించి సమాచారం అందించడంతో పోలీసులు అక్కడకు చేరుకుని గాలింపు చేపట్టారు. అయితే ఆచూకీ లభ్యం కాకపోవడంతో పాటు చీకటి పడడంతో వెనుదిరిగారు. ఆ తర్వాత ఏదైనా జంతువు మృతి చెంది ఉంటుందని భావించి అటుగా ఎవరూ వెళ్లలేదు. మంగళవారం ఉదయం మరోసారి అటుగా వెళ్లిన గొర్రెల కాపరులు ఓ కట్టడం దిగువన పొదల్లో పడి ఉన్న వ్యక్తి గుర్తించి, సమాచారం అందించడంతో పోలీసులు వెళ్లి పరిశీలించారు. మృతదేహం పూర్తిగా కుళ్లి ఛిద్రమై ఉండడంతో ఆనవాళ్లు లభ్యం కాలేదు. ఎవరైనా హత్య చేశారా? లేక ఆత్మహత్య చేసుకున్నాడా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

జెడ్పీ డిప్యూటీ సీఈఓ అమృతరాజ్ సస్పెన్షన్

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి జిల్లా పరిషత్ ఉప కార్యనిర్వహణాధికారి (డిప్యూటీ సీఈఓ-ఎఫ్ఏసీ) ఎండీ అమృతరాజ్ సస్పెండ్ అయ్యారు. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. శ్రీశైలం ఐటీడీఏ ఏపీఓగా పని చేసిన లలితా బాయిని అనంతపురం జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. అయితే ఆమె విధుల్లో చేరకుండా అమృతరాజ్ అడ్డుకోవడాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. ఈ కారణంగా ఆయన్ను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు.

చిరుత దాడిలో మేకల మృతి



మృతి చెందిన మేకలు

రాయదుర్గం రూరల్: చిరుత దాడిలో రెండు మేకలు మృతి చెందాయి. వివరాలు.. రాయదుర్గం మండలం మల్లాపురం గ్రామానికి చెందిన ఎర్రిస్వామి మేకల పోషణతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సోమవారం ఉదయం తన మేకలను మేపు కోసం సమీపంలోని జట్లతిప్ప కొండపైకి తోలుకెళ్లి, సాయంత్రానికి మందతో పాటు తిరిగి ఇంటికి చేరుకున్నాడు. మంగళవారం ఉదయం మేకలను లెక్కిస్తే రెండు తక్కువగా ఉండడంతో కొండలోకి వెళ్లి పరిశీలిస్తే పొదల్లో రెండు మేకల కళేబరాలు కనిపించాయి. చిరుత దాడిలో మృతి చెందినట్లు నిర్ధారించుకున్నాడు. కాగా గత నెల కూడా రెండు మేకలను చిరుత బలిగొందని ఈ సందర్భంగా కాపరి ఎర్రిస్వామి తెలిపాడు. దీంతో రూ.40 వేల మేర నష్టం వాటిల్లినట్లు వాపోయాడు. విషయం తెలుసుకున్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఆంజనేయులు, ఏబీఓ ప్రవీణ్‌కుమార్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. మేకల కళేబరాలకు పశు వైద్యుడితో పోస్టుమార్టం నిర్వహించి, నివేదికను ఉన్నతాధికారులకు పంపారు.

అమ్మకు మానవతావాదుల అండ

- వైఎస్సార్‌సీపీ నేతల చొరవతో పిల్లలు ఐసీడీఎస్‌కు తరలింపు
- కన్న తల్లి కష్టంపై ఆరా తీసిన ఎస్పీ శ్రీనివాసరావు



చంద్రకళను పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు శ్రీదేవి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: 'పిల్లలను పోషించలేక తల్లి ఆత్మహత్యాయత్నం' శీర్షికతో మంగళవారం 'సాక్షి'లో వెలువడిన కథనంపై మానవతావాదులు స్పందించారు. మంగళవారం ఉదయం సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు చంద్రకళను వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి పరామర్శించారు. తల్లితో పాటు బిడ్డలకు అండగా నిలిచేందుకు భరోసానిచ్చారు. పిల్లలకు హాస్టల్ వసతితో పాటు చదువుకూ సహకరిస్తామని హామీనిచ్చారు. చంద్రకళకు ఇంటి పట్టాతో పాటు ఇల్లు కట్టించి ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం ఇద్దరు చిన్నారులను ఐసీడీఎస్ అధికారులకు అప్పగించారు. కాగా, సరైన ఆహారం లేక రక్తహీనత బారిన పడిన చంద్రకళకు నాలుగు రోజుల పాటు చికిత్స అందించి డిశ్చార్జ్ చేయనున్నట్లు వైద్యులు తెలిపారు. చంద్రకళ దుస్థితిపై ఆమె పనిచేస్తున్న హోటల్ యజమాని ఆనంద్ స్పందించారు. ఆమె జీవనానికి పూర్తి సహకారం అందిస్తానని పేర్కొన్నారు. పిల్లలనూ తానే చదివిస్తానని భరోసానిచ్చారు. అలాగే చంద్రకళ అంశంపై ఎస్పీ శ్రీనివాసరావు సైతం ఆరా తీశారు. అనంతపురం వన్‌టౌన్ సీఐ రెడ్డెప్పను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆమెకు జరిగిన అన్యాయానికి పోలీసుల తరఫున ఎలాంటి న్యాయం చేయాలో చూడాలని ఆదేశించారు.

అన్ని ఇళ్లనూ సర్వే చేయండి : కలెక్టర్ గౌతమి



గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

ఆత్మకూరు: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటినీ సర్వే చేయాలని వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులను కలెక్టర్ గౌతమి ఆదేశించారు. సర్వేలో భాగంగా వెళ్లిన రోజు లబ్ధిదారులు ఇంటి వద్ద లేకపోతే రెండోసారి తప్పకుండా వెళ్లి వివరాలు ఆరా తీయాలని సూచించారు. మంగళవారం ఆత్మకూరు మండలంలోని సనప గ్రామంలో చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. సర్వే తీరును వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులతో ఆరా తీశారు. ఏ పథకాలకు ఎవరు అర్హులనే విషయంపై ప్రజలను చైతన్య పరచాలన్నారు. ప్రభుత్వ పథకాల లబ్ధి దక్కకుంటే దానికి గల కారణాలను వివరించాలన్నారు. గ్రామంలో కొందరు తమకు పింఛన్ లబ్ధి చేకూరడం లేదంటూ కలెక్టర్ ఎదుట వాపోయారు. దీంతో ఏడాదికి రెండు సార్లు కొత్త పింఛన్లను సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పంపిణీ చేస్తున్నారని, కొత్తగా దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి, అన్ని అర్హతుంటే ఆగస్టులో పింఛన్ మంజూరు చేస్తామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి రఘునాథరెడ్డి, తహసీల్దార్ షర్మిల, ఎంపీడీఓ విజయ్ ప్రసాద్, ఈఓఆర్డీ దామోదరరెడ్డి, ఎస్ఐ జనార్థన్, పంచాయతీ కార్యదర్శి కీర్తన పాల్గొన్నారు.

బీపీఎస్, ఎల్ఆర్ఎస్ పూర్తి చేయాలి

- టౌన్ ప్లానింగ్ ఆర్‌డీ సంజీవ్‌కుమార్

అనంతపురం క్రైం: పాత బీపీఎస్, ఎల్ఆర్ఎస్ ఫైళ్లను తక్షణమే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను టౌన్ ప్లానింగ్ ఆర్‌డీ సంజీవ్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం రాంనగర్‌లోని టౌన్ ప్లానింగ్ ఆర్‌డీ కార్యాలయంలో వివిధ జిల్లాల ఏసీపీలు, టీపీఓలు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లతో ఆయన సమావేశమయ్యారు. వివిధ ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై లోతుగా ఆరా తీశారు. ఈ నెలాఖరులోపు పెండింగ్ ఫైళ్లను క్లియర్ చేయాలని ఆదేశించారు. అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. నిబంధనలకు మేరకు నిర్మాణాలు జరిగేలా చూడాలన్నారు. సమావేశంలో ఏసీపీ బాలాజీ, టీపీఓ శిరీష, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ దుర్గాంజలి పాల్గొన్నారు.

జర్మనీలో ఉద్యోగావకాశాలు

అనంతపురం: బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం కోర్సు పూర్తి చేసి జర్మనీలో స్టాఫ్ నర్సు ఉద్యోగాలు పొందేందుకు ఆసక్తి ఉన్న వారికి జర్మనీ భాషపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, టీఏకేటీ ఇంటర్నేషనల్, ఏపీఎన్ఆర్‌టీఎస్ సంయుక్తంగా శిక్షణ ఇవ్వనున్నాయి. ఈ మేరకు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎల్.ఆనంద్‌రాజ్ కుమార్ మంగళవారం తెలిపారు. 20 నుంచి 35 సంవత్సరాల్లోపు వయస్సు కలిగి ఉండి కనీసం రెండేళ్ల సాధారణ ఆస్పత్రుల్లో పనిచేసిన అనుభవం కలిగిన వారు అర్హులు. ఆసక్తి ఉన్న వారికి విజయవాడలోని కేఎల్ యూనివర్సిటీ వేదికగా జర్మన్ భాషాపై బీ1 స్థాయి ఉచిత శిక్షణ ఇస్తారు. - రెజ్యూమ్, విద్యార్హత సర్టిఫికెట్లు, చెల్లుబాటు అయ్యే పాస్‌పోర్టు, అనుభవ ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా కలిగి ఉండాలి. అనంతరం ఉచిత విమాన ఛార్జీలు, భోజనం, వసతితో నెలకు వెయ్యి యూరోలు (రూ.89వేలు) జీతం చెల్లిస్తారు. అలాగే తొలి ఆరు నెలల పాటు జర్మనీలో బీ-2 సర్టిఫికెషన్ కోసం శిక్షణ ఇస్తారు. ఈ శిక్షణలో ఉత్తీర్ణత సాధించిన వారికి నెలకు 2,500 యూరోల జీతం చెల్లిస్తారు. పూర్తి వివరాలకు www.apssdc.in/home/ వెబ్‌సైట్‌లో పరిశీలించవచ్చు. ఆసక్తి ఉన్న వారు తమ రెజ్యూమ్‌ను helpline@apssdc.in మెయిల్‌కు లేదా కాల్ సెంటర్ (99888 53335) నంబర్‌కు షేర్ చేయవచ్చు.

గొర్రెల దొంగల అరెస్ట్



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

పెద్దవడుగూరు: గొర్రెలను అపహరించుకెళ్లినట్లుగా ఫిర్యాదు అందిన 24 గంటల్లోపు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను మంగళవారం యాడికి సీఐ శంకరరెడ్డి, ఎస్ఐ శ్రీనివాసులు వెల్లడించారు. ఈ నెల 22న పెద్దవడుగూరులోని చాకలి రాజుకు చెందిన పది గొర్రెలను దుండగులు అపహరించుకెళ్లారు. దీంతో చుట్టుపక్కల గ్రామాల్లో ఆరా తీసి, సోమవారం ఉదయం పెద్దవడుగూరు పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. గొర్రెల అపహరణకు సంబంధించి కొందరిపై తనకు అనుమానం ఉందంటూ వారి పేర్లను పేర్కొన్నాడు. దీంతో పోలీసులు అనుమానితులైన పెద్దవడుగూరులోని నరసింహ కాలనీకి చెందిన కాయల రామాంజినేయులు, జి.వెంకటాంపల్లి నివాసి దూదేకుల నాగరాజు, మరో బాలుడిని అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేయడంతో నేరం అంగీకరించారు. అపహరించుకెళ్లిన గొర్రెల విలువ రూ.1.20 లక్షలుగా ఉంటుందని తెలిపారు. గొర్రెల దొంగతనానికి ఉపయోగించిన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. బాలుడిని పరివర్తన కేంద్రం అధికారులకు అప్పగించారు.

విత్తుకు వేళాయె!

- ఆరుద్రతోపాటు వచ్చే రెండు కార్తెలు విత్తుకు అనువు
- ఈనెల 29న విత్తనాల ఏకాదశి.. సాగుకు శుభ గడియలు
- జూలై నెలాఖరు వరకు ఖరీఫ్ పంటలకు మంచి అదను
- 'నైరుతి' ప్రభావంతో వర్షాలు కురిస్తే జోరుగా 'ఏరువాక'

అనంతపురం అగ్రికల్చర్: ఈ నెల ఒకటి నుంచి ఖరీఫ్ ఆరంభమైంది. విత్తుకు వేళయ్యిందని రైతన్నలు సన్నద్ధమవుతున్నారు. పంటలు సాగు చేసుకునే శుభగడియలు తొలిఏకాదశితో ప్రారంభమవుతుందని చెబుతారు. 22న ఆరుద్రకార్తె కూడా ప్రారంభమైంది.. ఆరుద్రతో విత్తనకార్తెలు ప్రారంభమవుతాయని రైతులు చెప్తున్నారు. ఆరుద్రతో పాటు జూలై 6న పునర్వసు, ఆ తర్వాత జూలై 20న పుష్యమి కార్తెలు.. ఈ మూడు కార్తెలు విత్తుకునేందుకు అదనుగా భావిస్తారు. ఆగస్టు 3వ తేదీతో మూడు కార్తెలు ముగిసిపోతాయి. పూర్వం నుంచి విత్తనాల ఏకాదశిగా పిలవబడుతున్న తొలిఏకాదశి ఈనెల 29న వస్తుంది. ఇవన్నీ పరిగణలోకి తీసుకుంటే జూలై నెలంతా ఖరీఫ్ పంటల సాగుకు మంచి సమయమని శాస్త్రవేత్తలతో పాటు మన పెద్దలు కూడా చెబుతున్నారు.

దోబూచలాడుతున్న 'నైరుతి'...

ఈ సారి కీలకమైన నైరుతి రుతు పవనాలు (సౌత్‌వెస్ట్‌మాన్‌సూన్) రావడం ఆలస్యం కావడం, మధ్యలో మందగించడంతో ఇప్పటిదాకా పెద్దగా ప్రభావం చూపలేదు. ఈ నెల 8న కేరళను పవనాలు తాకాయి. మొదటి వారంలో జిల్లాకు తాకాల్సి ఉండగా 13న ప్రవేశించింది. వెంటనే విస్తరించాల్సి ఉండగా, బిపర్‌జాయ్ తుఫానుతో ఈనెల 18 వరకు రుతు పవనాలు కదలిక లేకుండా ఆగిపోయాయి. ఎట్టకేలకు గత నాలుగు రోజులుగా నైరుతి విస్తరించినా.. మేఘాలు దోబూచలాడుతూ తేలికపాటి వర్షాలకు పరిమితమయ్యాయి. నాలుగైదు మండలాలు మినహా ఎక్కడా పదును వర్షం పడకపోవడంతో ఏరువాక ఇంకా మొదలుకాని పరిస్థితి నెలకొంది.

సాగుకు సిద్ధం..

మే నెల, జూన్ మొదటి వారంలో కురిసిన వర్షాలకు భూములు దుక్కులు చేసుకున్న రైతులకు జగన్ మోహన్‌రెడ్డి సర్కారు రాయితీతో విత్తనాలు పంపిణీ చేస్తోంది. తగినంత ఎరువులు కూడా అందుబాటులో ఉంచింది. దీంతో ఖరీఫ్ సాగుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. నైరుతి ప్రభావంతో జిల్లా అంతటా మంచి పదను వర్షం కురిస్తే ఏరువాక జోరుగా సాగనుంది. ఈ సారి జిల్లా సాధారణ సాగు విస్తీర్ణం 4.40 లక్షల హెక్టార్లు (11.02 లక్షల ఎకరాలు) కాగా, అందులో వర్షాధారంగా 3.39 లక్షల హెక్టార్లు (8.49 లక్షల ఎకరాలు) కాగా, మిగతా లక్ష హెక్టార్లు (2.50 లక్షల ఎకరాలు) నీటి వసతి కింద పంటలు సాగులోకొస్తాయని అంచనా వేశారు. అందులో ప్రధాన పంట వేరుశనగ 2.31 లక్షల హెక్టార్లు, పత్తి 51 వేల హెక్టార్లు, కంది 30 వేల హెక్టార్లు, ఆముదం 12 వేల హెక్టార్లు, మొక్కజొన్న 8,500 హెక్టార్లు..ఇలా 15 నుంచి 18 రకాల పంటలు సాగులోకి రానున్నట్లు చెప్తున్నారు. అరకొర వర్షాలకు అక్కడక్కడ ఇప్పటి వరకు 2 వేల హెక్టార్ల వరకు పంటలు వేసినట్లు అధికారులు చెబుతున్నారు.

ఒకే గొడుకు కిందకు వసతి గృహాలు

- మూడు మండలాలకు ఓ సహాయ సంక్షేమ అధికారి
- త్వరలో అమలుకు కసరత్తు

అనంతపురం రూరల్: క్లస్టర్ విధానంతో అన్ని సంక్షేమ వసతి గృహాలు ఒకే గొడుకు కిందకు రానున్నాయి. తద్వారా ప్రభుత్వ వసతి గృహాల పర్యవేక్షణ మరింత పటిష్టం కానుంది. వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్న పేద విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం క్లస్టర్ విధానం ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. ఈ నిర్ణయం వల్ల ప్రతి మూడు మండలాలకు ఓ సహాయ సంక్షేమ అధికారి ఉంటారు. అన్ని శాఖల అధికారులను సమన్వయం చేస్తూ ప్రభుత్వం అమలు చేయనున్న క్లస్టర్ విధానాన్ని ఏడాది పాటు ప్రయోగదశలో అమలుకు చర్యలు తీసుకున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ జేడీ మధుసూదన్‌రావు తెలిపారు.

క్లస్టర్ విధానం ఇలా...

బీసీ సంక్షేమ శాఖ పరిధిలో 54, సాంఘిక సంక్షేమశాఖ పరిధిలో 55, గిరిజన సంక్షేమశాఖ పరిధిలోని 11, వికలాంగుల సంక్షేమ శాఖ పరిధిలో 2, మైనార్టీ సంక్షేమశాఖ పరిధిలో 2, రెసిడెన్సియల్ స్కూల్స్ 9 వసతి గృహాలు ఉన్నాయి. ఇప్పటి వరకూ ఆయా శాఖలకు సంబంధించి అధికారులే వసతి గృహాలను పర్యవేక్షించే వారు. అయితే క్లస్టర్ విధానంతో అన్ని శాఖలకు సంబంధించిన వసతి గృహాల పర్యవేక్షణ సహాయ సంక్షేమ అధికారికి అప్పగించనున్నారు. మండలాల పరిధిలో పని చేసే సహాయ సంక్షేమ అధికారులు ఒక్కొక్కరికి 18 వసతి గృహాల పర్యవేక్షణ అప్పజెప్పనున్నారు. జిల్లా కేంద్రంలో 28 వసతి గృహాలు ఉండడంతో ఇక్కడ ఇద్దరు సహాయ సంక్షేమ అధికారులను నియమించనున్నారు.

అనుమతి రాగానే అమలు

ప్రభుత్వ ఆదేశాల మేరకు క్లస్టర్ విధానంపై అన్ని శాఖల అధికారులతో కలసి కసరత్తు ప్రారంభించాం. ఇప్పటికే జిల్లాలో వసతి గృహాల మ్యాపింగ్ ప్రక్రియ పూర్తయింది. నివేదికను కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి పంపుతాం. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే క్లస్టర్ విధానాన్ని అమలు చేస్తాం.

– మధుసూదన్‌రావు,
జేడీ, సాంఘిక సంక్షేమశాఖ

అనూషకు అభినందన



అనూషను అభినందిస్తున్న మాంఛోఫెర్రర్

అనంతపురం: అండర్-23 ఉమెన్ ఆసియా కప్ క్రికెట్ టోర్నీలో ప్రాతినిధ్యం వహించే భారత జట్టులో చోటు దక్కించుకున్న అనంతపురం జిల్లా క్రీడాకారిణి అనూషకు అభినందనలు వెల్లువెత్తాయి. మంగళవారం ఉదయం ఆమె ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛోఫెర్రర్‌ను కలసి ఆశీస్సులు అందుకున్నారు. తన ఎదుగుదలకు ఆర్డీటీనే కారణమంటూ పేర్కొన్నారు. అనంతరం ఆర్డీటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అన్నే ఫెర్రర్, ఉమెన్ ఎంపవర్‌మెంట్ డైరెక్టర్ విశాల ఫెర్రర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆమెను అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్ చైర్మన్ పీఎల్ ప్రకాష్‌రెడ్డి, జనరల్ సెక్రెటరీ మధు ఆచారి, ట్రెజరర్ షబ్బీర్ అహమ్మద్, జాయింట్ సెక్రెటరీ భీమలింగారెడ్డి, ఆర్డీటీ చైర్మన్ తిప్పేస్వామి, మాజీ క్రికెటర్ షాబుద్దీన్ తదితరులు అభినందించారు.

సిమెంట్ వివరాలు 'సమగ్ర'ంగా ఇవ్వాలి

- ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన డీఈతో వన్‌టౌన్ సీఐ
- 'లాగిన్' బ్లాక్ చేయడంతో తలలు పట్టుకుంటున్న అధికారులు
- కంపెనీ నుంచి వివరాలు తెచ్చుకోకపో వడంపై అనుమానాలు
- వివరాల కోసం అల్ట్రాటెక్ కంపెనీకి నేడు వెళ్లనున్న అధికారులు

రాప్తాడురూరల్: సమగ్ర శిక్ష ఈఈ కార్యాలయం లో జరిగిన సిమెంట్ స్కాంపై వివరాలు సమగ్రం గా ఇవ్వాలని వన్‌టౌన్ పోలీసులు కోరారు. అరకొర వివరాలతో ఫిర్యాదు చేసేందుకు డీఈ వెళ్లడంతో పోలీసులు కేసు నమోదుకు నిరాకరిం చారు. వాస్తవానికి సమగ్రశిక్ష ఈఈ శివకుమార్ ఫిర్యాదు చేసేందుకు వెళ్లాల్సి ఉంది. అయితే ఆయన కర్నూలులో మంత్రి కార్యక్రమంలో ఉండ డంతో సత్యసాయి జిల్లా డీఈ చితంబరంకు నోట్ ఆర్డర్ ఇచ్చారు. దీంతో డీఈ మంగళవారం సాయంత్రం సీఐ రెడ్డప్పను కలిశారు. ఫిర్యాదులో వివరాలు సమగ్రంగా లేకపోవడంతో పూర్తి వివ రాలు ఇవ్వాలని సీఐ కోరారు. ' ఏ తేదీన బుక్ చేశారు...ఏ కాంట్రాక్టర్ పేరు మీద బుక్ చేశా రు...ఏ బ్యాంకులో ఎవరి అకౌంట్‌ద్వారా డబ్బులు చెల్లించారు...సదరు కంపెనీ నుంచి సిమెంటు లోడు ఎప్పుడు బయలుదేరింది...ఎక్కడికి వెళ్లిం ది' తదితర వివరాలేమీ లేకపోతే దర్యాప్తునకు ఇబ్బందిగా ఉంటుందని సీఐ పేర్కొన్నారు. చేసేదే మీలేక డీఈ వెనక్కు తిరిగొచ్చారు. ఈ వ్యవహారం లో ఇద్దరు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను విధుల నుంచి తప్పించిన సంగతి తెలిసిందే.

అక్రమాల వ్యవహారంపై అనేక అనుమానాలు..

శ్రీసత్యసాయి జిల్లాలోని నాబార్డు స్కూళ్లు, కేజీ బీవీ జూనియర్ కళాశాలల్లో నిర్మాణాలకు సబ్సిడీ సిమెంట్ కోసం ముగ్గురు కాంట్రాక్టర్ల పేర్ల మీద సిమెంట్ బుక్ చేశారు. శ్రీసత్యసాయి జిల్లా విడిపో యిన తర్వాత డీఈ, ఈఈల పేర్లతో వచ్చిన కొత్త లాగిన్లను ఆ జిల్లాకు పంపకుండా అనంతపురం ఈఈ కార్యాలయంలోనే ఇద్దరు ఉద్యోగులు లాగిన్ అయ్యారు. ఆ సమయంలో వచ్చే ఓటీపీల కోసం ఆ ఇద్దరి ఉద్యోగుల ఫోన్ నంబర్లు నమోదు చేశారు. అంతే అప్పటి నుంచి కాంట్రాక్టర్ల పేర్లతో సిమెంట్ బుక్ చేయడం..వచ్చిన సిమెంట్ లోడ్లను బయట మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకుం టూ వచ్చారు. అయితే ఇతరుల ప్రమేయం లేకుం డా కేవలం ఆ ఇద్దరు కాంట్రాక్ట్ ఉద్యోగులు ఇంత వ్యవహారం నడిపింటారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే కొందరి సైట్ ఇంజి నీర్ల పాత్రలపై ప్రచారం సాగుతోంది.

డీఈ నంబరు ఎలా వచ్చింది?

మొత్తం సిమెంట్ అల్ట్రాటెక్ కంపెనీ నుంచే వచ్చిం ది. ఇండెంట్ పెట్టిన సమయంలో ఆ ఇద్దరు ఉద్యో గుల ఫోన్ నంబర్లు ఉన్నాయి. అయితే ఒక డీఈ ఉపయోగించే ఫోన్ నంబరుపై కూడా దాదాపు 12 లోడ్లు బుక్ చేశారు. డీఈ నంబరు ఎలా వచ్చిం దనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దాదాపు రెండు వారాల కిందటే సిమెంట్ స్కాం విష యాన్ని ఇంజినీరింగ్ అధికారులు గుర్తించారు. అయితే బయటకు పొక్కకుండా గోప్యత పాటిస్తూ విచారణ చేస్తూ వచ్చారు.

కంపెనీతో వివరాలు తెచ్చుకోకపోవడం వెనుక ఆంతర్యమేమిటో..

వ్యవహారం బయటకు పొక్కడంతో ఇన్ని రోజులుగా దొంగచాటున వినియోగించిన డీఈ, ఈఈ లాగిన్లను బ్లాక్ చేశారు. వివరాలు కావాలం టే ఆ లాగిన్లనే చూడాలి. లేదంటే సిమెంట్ పంపిన కంపెనీ వద్ద సమగ్రంగా వివరాలు ఉంటాయి. కానీ కంపెనీ నుంచి ఆ వివరాలు తెప్పించుకునే ప్రయత్నం ఇప్పటిదాకా చేయలేదు. దీని వెనుక ఆంతర్యమేమిటో అధికారులకే తెలియాలి. లాగి న్లను బ్లాక్ చేసినట్లు గుర్తించిన వెంటనే అల్ట్రాటెక్ కంపెనీకి వెళ్లి ఉంటే మొత్తం బండారం బయటకు వచ్చేది. వివరాలు లేకుండా పోలీసులకు ఫిర్యాదు చేశారు. పూర్తి వివరాలు లేకపోవడంతో వారు కేసు నమోదు చేయలేదు. కాగా బుధవారం అల్ట్రాటెక్ కంపెనీకి వెళ్లి పూర్తి వివరాలు తెచ్చుకునే ఆలో చనలో ఇంజినీరింగ్ అధికారులు ఉన్నారు.

సీఎం జగన్‌తోనే పేదలకు న్యాయం

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి


రుద్రంపేట సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం రూరల్: రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిం చడమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. మంగళ వారం రుద్రంపేట సచివాలయం-1 వద్ద సచివా లయ సిబ్బంది, వలంటీర్లు, గృహ సారథులతో 'జగనన్న సురక్ష' కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమ న్నారు. రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామ న్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలు అం దాలంటే జన్మభూమి కమిటీ సభ్యులు, టీడీపీ నాయకుల దయ ఉంటేనే సంక్షేమ పథకాలు అం దేవన్నారు. అర్హత ఉంటే చాలు సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా నేరుగా ప్రజల ముంగిటకే సంక్షేమ పథకాలు అందుతున్నా యన్నారు.

ఇప్పటికే గడప గడపలో పరిష్కారం..

గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇప్పటికే ప్రజల సమస్యలకు పరిష్కారం చూపామని ఎమ్మెల్యే అన్నారు. అర్హత ఉన్న ఏ ఒక్కరికీ అన్యాయం జరగకుండా ఉండాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. సచివాలయ సిబ్బంది, వలం టీర్లు, గృహసారథులు, అన్ని శాఖల అధికా రులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేసి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవం తం చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మావతి, వైస్ ఎంపీపీ బాలాజీ, ఎంపీ టీసీలు, మహబూబీ, నారాయణమ్మ, ఓం ప్రకా ష, జేసీఎస్ కన్వీనర్ ఆలమూరు శ్రీనివాసరెడ్డి, వైఎ స్సార్‌సీపీ సీనియర్ నాయకులు అనంత చం ద్రారెడ్డి, ప్రకాష్‌రెడ్డి, కుళ్లాయప్ప, సాధిక్ వలి, చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణవేణి, పురుషోత్తం, తిరుపతినాయుడు, రామ్మూర్తి తదితరులు పాల్గొ న్నారు.

అర్హులందరికీ పథకాలు అందించడమే లక్ష్యం


17వ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్ర మంలో మాట్లాడుతున్న మేయర్ వసీమ్

అనంతపురం క్రైం: అర్హులైన ప్రతి ఒక్కరికీ సం క్షేమ పథకాలు అందించడమే లక్ష్యమని మేయర్ వసీం తెలిపారు. మంగళవారం పాతూరు 17వ సచి వాలయ ఆవరణంలో 17,19 సచివాలయాల సిబ్బంది, వలంటీర్లకు జగనన్న సురక్షపై అవగా హన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మేయర్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో సంక్షేమ విప్లవాన్ని తీసుకువచ్చారని అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 99 శాతం అందించినట్లు తెలిపారు. ప్రభుత్వం అం దించనున్న 11 ఉచిత సేవలను ప్రజలకు తెలియ జేసి, వచ్చే నెల 1 నుంచి జరిగే జగనన్న సురక్ష కార్యక్రమాలకు హాజరయ్యేందుకు చర్యలు తీసుకో వాలన్నారు. డిప్యూటీ మేయర్లు కోగటం విజయభా స్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య మాట్లాడారు. కార్యక్ర మంలో నగరపాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీని వాసులు, కార్పొరేటర్లు బాబాఫక్రుద్దీన్, కమల్‌భూ షణ్, అనిల్‌కుమార్ రెడ్డి, ఆర్ఐ మురళీ, నాయ కులు ఖాజా, సత్రసాల మంజునాథ్, తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపండి

నగరంలోని 20వ డివిజన్ మోమిన్ స్ట్రీట్‌లో డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించేలా చర్యలు తీసుకోవాలని మేయర్ వసీం ఇంజినీర్లను ఆదేశిం చారు. స్థానికంగా ఉండే తబ్రేజ్, జాఫర్, రఫీ, షకీల్‌లు డివిజన్‌లో నెలకొన్న సమస్యతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారని మేయర్‌కి ఫోన్ ద్వారా తెలియజేశారు. దీంతో స్పందించిన మేయర్ వసీం డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజ యభాస్కర్ రెడ్డితో కలసి మోమిన్ స్ట్రీట్, తదితర ప్రాంతాల్లో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. టెండర్లు పూర్తయిన పనులను ప్రారంభిస్తే డ్రైనేజీ సమస్యకు పరిష్కారం చూపవచ్చన్నారు. నెలలు తరబడి పనులు ప్రారంభించకపోతే ఎలాగన్నారు. తక్షణం పనులను ప్రారంభించేలా చూడాలన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వంలో మంజూరైన పనులను త్వరగా చేపట్టేలా చూడాలన్నారు. కాలు వలు, రోడ్లు వేసేందుకు ప్రజల సహకారం ఉండా లన్నారు. మేయర్ వెంట కార్పొరేటర్లు లావణ్య, అనిల్‌కుమార్ రెడ్డి, కమల్‌భూషణ్, వైఎస్సార్ సీపీ నాయకులు చిన్ని, తబ్రేజ్, ఖాజా ఉన్నారు.

విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి సాయిరామ్


ఐఎఫ్‌పీని పరిశీలిస్తున్న డీఈఓ సాయిరామ్

రాప్తాడురూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యా ర్థులు అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చుకొని ప్రపంచస్థాయిలో పోటీపడాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం అని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరామ్ అన్నారు. మం గళవారం అనంతపురం నగరంలోని కేఎస్ఆర్ బాలి కల పాఠశాలలో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లను (ఐఎ ఫ్‌పీ) ఏర్పాటు చేశారు. ఈ పాఠశాలకు మొత్తం 18 ఐఎఫ్‌పీలు వచ్చాయి. ఒక్కో ఐఎఫ్‌పీ ధర రూ. 1.60 లక్షలకు పైగా ఉంటుంది. వీటిని డీఈఓ సాయిరామ్ పరిశీలించారు. నాడు-నేడు పనులు పూర్తయిన ఉన్నత పాఠశాలలకు ఈ విద్యా సంవ త్సరం నుంచి ఐఎఫ్‌పీల బోధన సాగుతుందన్నారు. జిల్లాలో తొలి విడతగా 534 ఉన్నత పాఠశాలల్లో 1,595 ఐఎఫ్‌పీలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఇప్ప టికే చాలా వరకు వచ్చాయన్నారు. ఈ ప్యానళ్లు స్కూళ్లకు వచ్చిన వెంటనే 6-10 తరగతుల్లో ప్రతి గదిలోనూ ఏర్పాటు చేయించాలని హెచ్ఎంలకు ఆదేశించారు. ఇంటర్నెట్ సదుపాయం ఉండడంతో కంప్యూటర్‌గా ఉపయోగించుకోవచ్చన్నారు. యూట్యూబ్ చూడొచ్చన్నారు. పేద విద్యార్థులకు నాణ్యమైన, పోటీతత్వానికి అవసరమైన కంటెంట్ అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చిస్తోందన్నారు. డీఈఓ వెంట అనంతపురం డీవైఈఓ పద్మప్రియ, ఏఎస్ఓ ఓబుళరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'విద్యుత్ చార్జీలు తగ్గించే వరకు పోరాటం'

అనంతపురం అర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ చార్జీలను పెంచుతూ ప్రజలపై భారాలు మోపుతున్నాయని వామపక్ష పార్టీల నాయకులు అన్నారు. పెంచిన చార్జీలను తగ్గించే వరకు పోరా టం చేస్తామన్నారు. ఈనెల 30న జిల్లా వ్యాప్తంగా విద్యుత్ కార్యాలయాల ఎదుట ఆందోళనలు నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. మంగళ వారం స్థానిక ఎన్‌జీఓ హోంలో వామపక్ష పార్టీల నాయకులు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా సీపీఎం, సీపీఐ, సీపీఐ ఎంఎల్, సీపీఐఎంఎల్ (ఎన్‌డీ), ఎస్‌యూసీఐ జిల్లా కార్యదర్శులు రాంభూపాల్, జాఫర్, పెద్దన్న, ప్రభాకర్‌రెడ్డి, తబ్రేజ్ పాల్గొని మాట్లాడారు. సమావేశంలో నాయకులు త్రిలోక్ నాథ్, రాజమోహన్, రామిరెడ్డి, శ్రీరాములు, అలీపీరా, రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

'అధికారంలో ఉన్నన్నాళ్లూ దోచుకున్నారు'

రామగిరి: టీడీపీ అధికారంలో ఉండగా దోచుకుతి న్నారు.. అప్పట్లోనే ఎల్ఈడీ బల్బుల కుంభకోణం జరిగిందన్న విషయం గుర్తు చేసుకోవాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రమేష్, సింగిల్ విండో ప్రెసిడెం ట్ ముత్యాలు, సర్పంచ్ సరస్వతి అన్నారు. సర్పంచ్ చెక్ పవర్‌ను రద్దు చేసినా గ్రామంలో వీధిలైట్లు, తాగు నీరు, అన్ని సౌకర్యాలూ కల్పించామన్నారు. పేరూ రులో టీడీపీ చేపట్టిన భవిష్యత్‌కు భరోసా పేరుతో చేపట్టిన బస్సు యాత్రలో పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ గ్రామంలో వీధిలైట్లనుకూడా వేయలేకపోయారని విమర్శించడం సరికాదన్నారు. దీనిపై వైఎస్సార్‌సీపీ నాయకులు రామగిరిలో విలేకరు లతో మాట్లాడారు. నాయకులు జనార్దన్, వెంకటరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

నేడు'స్పై' సినిమా ఈవెంట్

అనంతపురం కల్చరల్: అనంతపురంలోని ఎస్వీ సినీ మ్యాక్స్ థియేటర్‌లో 'స్పై' సినిమా ప్రత్యేక ఈవెంట్ బుధవారం సాయంత్రం ఆరు గంటలకు నిర్వహించనున్నారు. హీరో నిఖిల్, ఐశ్వర్య మీనన్, సాన్య ఠాకూర్ నటించిన ఈ చిత్రానికి గ్యారీ బీహెచ్ దర్శకత్వం వహించారు. నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య ప్రారంభించే ఈవెంట్‌లో అభి మానులు, సినీ ప్రేక్షకులు పాల్గొనాలని ఎస్వీ సినీ మ్యాక్స్ మేనేజర్ గౌడ్ కోరారు.

నగదు ప్రోత్సాహకాలు

కనగానపల్లి: పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ సాధిం చిన విద్యార్థులకు దాతలు నగదు బహుమతులు అందజేశారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో దాతలు ధర్మవరానికి చెందిన సిద్దా నాథం సత్యనారాయణ కుటుంబ సభ్యులు నగదు బహుమతులు అందజేసినట్లు హెచ్ఎం లక్ష్మీదేవి తెలిపారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 479 మార్కులు సాధించిన విద్యార్థి గోపిచంద్‌కు రూ.5 వేలు, 474, 464 మార్కులతో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థినులు చరిత, శ్రీదేవిలకు రూ.3 వేల చొప్పున దాతల తరఫున ఉపాధ్యా యుడు అబ్బాస్ అందజేశారు.

పేద విద్యార్థుల చదువుకు ప్రభుత్వం పెద్దపీట


మాట్లాడుతున్న డీవైఈఓ పద్మప్రియ

రాప్తాడురూరల్: పేద విద్యార్థుల చదువుకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అనంతపురం విద్యా డివిజన్ డిప్యూటీ డీఈఓ పద్మప్రియ అన్నారు. మంగళవారం స్థానిక కేఎస్ఆర్ ప్రభుత్వ బాలికల పాఠశాలలో పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీవై ఈఓ పద్మప్రియ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యాభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథ కాలతో ప్రభుత్వ పాఠశాలలు రూపురేఖలు మారి పోయాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువు కునే విద్యార్థులకు జగనన్న కిట్లు, అమ్మ ఒడి, జగ నన్న గోరుముద్ద, రాగి జావా, ట్యాబ్‌లు ఉచితం గా అందిస్తున్నట్లు తెలిపారు. మనబడి నాడు- నేడు కార్యక్రమంతో రూ.కోట్లు ఖర్చు చేసి అభివృ ద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా వసతులు కల్పించార న్నారు. ప్రతి విద్యార్థీ దేశం గర్వించే స్థాయికి ఎదగాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యం అన్నారు. సమావేశంలో ప్రధానో పాధ్యాయురాలు కిరణ్మయి, ఉపాధ్యాయురాళ్లు పాల్గొన్నారు.

చలో విజయవాడ పోస్టర్ల విడుదల

కనగానపల్లి: రైతాంగ సమస్యల పరిష్కారానికి ఈ నెల 30న చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమంపై ఏపీ రైతు సంఘం నాయకులు ప్రచార పోస్టర్లు విడుదల చేశారు. స్థానిక వ్యవసాయ కార్యాలయం వద్ద మంగళవారం జిల్లా రైతు సంఘం సహాయ కార్యదర్శి కదిరప్ప ఆధ్వర్యంలో రైతు సంఘం నాయకులు పోస్టర్లు విడుదల చేశారు. 2022 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పంటల బీమా పరిహారంతో పాటు ఇన్‌పుట్ సబ్సిడీని రైతులకు వెంటనే అందజే యాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమం లో రైతు సంఘం నాయకులు రామాంజనేయులు, ముత్యాలు, నాగన్న, అంజీ, నరసింహులు, ఆనం ద్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

మేమంతా వైఎస్ జగన్ వెంటే ఉన్నాం

- మైనార్టీ ప్రతినిధులతో ముస్లింలు


సోమనాథ్‌నగర్ మసీదులో బ్రోచర్లు పంపిణీ చేసిన మేయర్, ఉర్దూ అకాడమీ చైర్మన్

అనంతపురం సిటీ: హమ్ సబ్ జగన్‌కే సాత్ హై (మేమంతా జగన్ వెంటే ఉన్నాం) అంటూ అనం తపురం సోమనాథ్‌నగర్ ప్రాంత ముస్లింలు ప్రకటించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు 'హర్ దిల్ మే వైఎస్సార్-హమ్ సబ్ జగన్‌కే సాత్' కార్యక్రమంలో భాగంగా సోమనా థ్‌నగర్‌లోని మస్జీదే సాద్ మసీద్‌లో మంగళ వారం కార్యక్రమం నిర్వహించారు. మేయర్ మహమ్మద్ వసీం సలీం, ఉర్దూ అకాడమీ చైర్మన్ హిరియాల్ నదీం అహమ్మద్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లాబేగ్ పాల్గొన్నారు. నమాజు అనంతరం ముస్లింలతో చర్చించారు.

సంక్షేమ పథకాలతో సంతృప్తిగా ఉన్నాం..

వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చాక ముఖ్యమం త్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలు గురించి నాయకులు ఆరా తీయగా.. అందరూ సంతృప్తి వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలన్నీ తమకు అందుతున్నాయన్నారు. ఫీజు రీయింబర్స్‌మెం ట్‌తో తమ పిల్లలు ఇంజినీరింగ్, డాక్టర్ కోర్సులు కూడా చదవగలుగుతున్నారన్నారు. వైఎస్సార్ అమలు చేసిన నాలుగు శాతం రిజర్వేషన్‌తో ఇది సాధ్యమైందన్నారు. తమ పిల్లలకు ఇంతకంటే ఆస్తి ఇంకేం అవసరం లేదనే ఆత్మవిశ్వాసాన్ని అక్కడి ముస్లింలు వ్యక్తం చేశారు. ప్రస్తుతం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాజకీయంగా ముస్లింలకు ప్రాధాన్యం లభించిందని, ఇది మర్చిపోలేమ న్నారు. సోమనాథ్‌నగర్ ప్రాంత ముస్లింలను మైనార్టీ ప్రతినిధులు అభినందించారు. కార్పొరే టర్ ఇషాక్, కోఆప్షన్ సభ్యుడు షంషుద్దీన్, ముస్లిం నేతలు పాల్గొన్నారు.

ఫిర్యాదుల నమోదుపై అవగాహన అవసరం

అనంతపురం క్రైం: జగనన్న సురక్ష యాప్‌లో ఫిర్యాదుల నమోదుపై అవగా హన పెంచుకోవాలని సచివాలయ సిబ్బంది, వలంటీర్లను కమిషనర్ రమణా రెడ్డి ఆదేశించారు. జగనన్న సురక్ష అవగాహన కార్యక్రమంలో భాగంగా 27, 28వ సచివాలయ పరిధిలో జరుగుతున్న సర్వేను కమిషనర్ ఆకస్మిక తనిఖీ చేశారు. వచ్చే నెల 1 నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందని, అంతలోపు ప్రతి ఇంటికీ వెళ్లి ఏమైనా సమస్యలుంటే నమోదు చేయాలన్నారు. ప్రభుత్వం అందించే 11 సేవల గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు.

క్రమశిక్షణ చర్యలు తప్పవు .. :

ప్రజారోగ్యంపై నిర్లక్ష్యం చేస్తున్న పారిశుధ్య కార్యదర్శులపై క్రమశిక్షణ చర్య లకు వెనుకాడబోమని కమిషనర్ స్పష్టం చేశారు. నగరంలోని 74 సచివాల యాల పరిధిలోని 41 మంది పారిశుధ్య కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. మంగళవారం ఆయన నగరంలోని హౌసింగ్ బోర్డు, బుడ్డప్పనగర్, తదితర ప్రాంతాల్లో కార్మికులతో మాట్లాడారు.

నేడు సంగీత విభావరి

అనంతపురం కల్చరల్: అనంత నాగ్ సంగీత్ స్వర్గ్ కల్చరల్ కమిటీ ఆధ్వర్యం లో బుధవారం సాయంత్రం 5.30 గంటలకు స్థానిక కృష్ణకళా మందిరంలో గొప్ప సంగీత విభావరి ఉంటుందని నిర్వాహకులు నాగిన్ కరణం వెంకటప్ర సాద్ ఓ ప్రకటనలో తెలిపారు.

క్లుప్తంగా

రక్తదానం మహోద్యమంలా సాగాలి


రక్తదానం చేస్తున్న సీఐటీయూ నాయకులు, చిత్రంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు

అనంతపురం అర్బన్: రక్తదానం మహోద్య మంలా సాగాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్య క్షుడు జి.ఓబులు పిలుపునిచ్చారు. సీఐటీయూ ఉద్యమ నిర్మాణ పర్సా సత్యనారాయణ శత జయంతి సందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యం లో స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని మానవత రక్తదాతల సంస్థ అధ్యక్షుడు తరిమెల అమర్‌నాథ్‌రెడ్డితో కలిసి ఓబులు ప్రారంభించారు. అనంతరం ఓబులు మాట్లాడుతూ ఉద్యోగ కార్మికుల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం కోసం నిరం తర పోరాటం చేస్తున్న సీఐటీయూ సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ ముందుంటుంద న్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, నాయకులు వెంక టనారాయణ, కార్మికులు పాల్గొని రక్తదానం చేశారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు


విత్తన దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ రవి, ఏవో శశికళ

అనంతపురం అగ్రికల్చర్: రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలని వ్యవసా యశాఖ అనంతపురం డివిజన్ ఏడీఏ ఎం.రవి ఇన్‌పుట్ డీలర్లను ఆదేశించారు. రూరల్ ఏవో శశికళతో కలిసి మంగళవారం నగరంలో విత్తన దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. లైసెన్సులు, స్టాక్,సేల్స్ రిజిష్టర్లు, రైతు బిల్లులు, గోదాముల్లో నిల్వలు పరిశీలించారు. నిబంధనల మేరకు క్రయ,విక్రయాలు సాగిం చాలని, విత్తన నాణ్యతకు పెద్ద పీట వేయా లన్నారు. ఎంఆర్‌పీకి మించి అమ్మినా, ఒరిజి నల్ బిల్లు ఇవ్వకున్నా చర్యలు తప్పవని హెచ్చరించారు. నిషేధిత విత్తనాలు, నిబంధ నలు ఉల్లంఘించి విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు అందితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఏ నారాయణపురం ఆర్‌బీకేను సందర్శించి రైతులకు విత్తన వేరుశనగ పంపిణీ చేశారు.

ఈ- ఆశ యాప్‌లో పొందుపర్చండి


ఈ-ఆశ యాప్‌పై ఆశా వర్కర్లకు అవగాహన కల్పిస్తున్న డీఐఓ యుగంధర్

అనంతపురం క్రైం: ప్రభుత్వం ప్రజలకు అంది స్తున్న అన్ని వైద్య సేవలను ఈ - ఆశ యాప్‌లో పొందుపర్చాలని జిల్లా ఇమ్యునై జేషన్ అధికారి డాక్టర్ యుగంధర్ తెలిపారు. మంగళవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఆశా వర్కర్లకు ఈ ఆశ యాప్‌పై ఆయన అవ గాహన కల్పించారు. ఈ ఆశ యాప్ డౌన్‌లోడ్ చేసుకొని ఏవిధంగా లాగిన్ అవ్వా లి.. ? ఇతర వివరాలను ఆయన తెలియజే శారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందించే సేవలన్నీ ఈ యాప్‌లో నమోదు చేయాలన్నారు. హెచ్‌బీఎస్‌సీ, హెచ్‌బీవైసీ, విటమిన్ ఏ, ఐఎఫ్ఏ టాబ్లెట్ ఎలా నమోదు చేయాలని ఆశాలకు వీడియో ప్రదర్శన ద్వారా వివరించారు. కార్యక్రమంలో డీసీఎం శ్రీరాములు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సజ్జల'ను కలసిన ఎంఈఓ కార్యాలయ మెసెంజర్లు


సజ్జల రామకృష్ణారెడ్డికి బొకే అందిస్తున్న మెసెంజర్ల సంఘం నాయకులు

రాప్తాడురూరల్: మండల విద్యాశాఖ అధికారి కార్యాలయాల్లో మెసెంజర్లుగా పని చేస్తున్న తమను రెగ్యులర్ ఆఫీస్ సబార్డినేట ర్లగా నియమించేలా చూడాలని మెసెంజర్ల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం విజయవాడలో ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసి విన్నవించారు. వారు మాట్లాడుతూ ఎంఈఓ కార్యాలయాల్లో 16 ఏళ్లుగా మెసెంజర్లుగా పనిచేస్తున్నామన్నారు. ఏడేళ్లుగా వేతనాలు పెంచలేదన్నారు. మెసెంజర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అరుణ, అనంతపురం జిల్లా నాయకులు రాజశేఖర్, రవి, కోదండ, రమేష్, సూరి తదితరులు పాల్గొన్నారు.

నేడు టపాసుల వేలం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: స్థానిక నాల్గో పట్టణ పోలీసు స్టేషన్‌లో సీజ్ చేసిన టపాసులు ఈ నెల 28న బహిరంగ వేలం వేయనున్నట్లు సీఐ ప్రతాప్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు ఉదయం 10 గంట లకు నాల్గో పట్టణ పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకోవాల న్నారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు సీఐ తెలిపారు.

సింగంపల్లిలో బోనాలు


సింగంపల్లిలో బోనాలు తీసుకెళ్తున్న గ్రామస్తులు

ఆత్మకూరు: మండలంలోని సింగంపల్లి గ్రామం లోని పోలేరమ్మ దేవతకు గ్రామస్తులు మంగళ వారం బోనాల ఉత్సవం నిర్వహించారు. గ్రామ స్తులు మాట్లాడుతూ ఆషాఢ మాసంలో మూడు మంగళవారాలు పోలేరమ్మ దేవతకు బోనాలు తీసు కెళ్లనున్నట్లు తెలిపారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థినికి గాయాలు



అనంతపురం శ్రీకంఠంస ర్కిల్: స్థానిక ఎన్టీఆర్‌మార్గ్ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విద్యా ర్థిని పల్లవి తీవ్రంగా గాయప డినట్లు ట్రాఫిక్ సీఐ వెంక టేష్ నాయక్ తెలిపారు. మాంటిస్సోరి స్కూల్‌కు బయల్దేరిన విద్యార్థిని రోడ్డు దాటే క్రమంలో రాయల్ ఎన్‌ఫీల్డ్‌పై అతివేగంగా వస్తున్న గుర్తు తెలియని వ్యక్తి విద్యార్థినిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో విద్యార్థిని కాలికి తీవ్రగాయమైంది. స్థానికులు, కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితురాలి తండ్రి రామాంజనేయులురెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

డాక్టర్ రఘునందన్ సేవలు స్ఫూర్తిదాయకం


డాక్టర్ రఘునందన్‌ను సన్మానిస్తున్న వైద్యులు

అనంతపురం క్రైం: ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపరిం టెండెంట్ డాక్టర్ రఘునందన్ సేవలు స్ఫూర్తిదాయ కమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రామస్వామి నాయక్ అన్నారు. బదిలీపై విజయవాడకు వెళ్తున్న సూపరింటెండెంట్‌కు ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని ఏపీజీడీఏ హాల్‌లో మం గళవారం ఆత్మీయ వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. అనంతరం సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్‌ను సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ శివకుమార్, ప్రభుత్వ వైద్యుల సంఘం నాయకులు డాక్టర్ వైఎంఎస్ ప్రసాద్, డాక్టర్ సుబ్ర మణ్యం, డాక్టర్ రామస్వామి, డాక్టర్ షంషాద్‌బేగం, డాక్టర్ సంధ్య, డాక్టర్ రవికుమార్, డాక్టర్ ప్రవీణ్‌దీన్‌కు మార్, డాక్టర్ శంకర్‌నారాయణ, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో సూపరింటెండెంట్‌ను విద్యుత్‌శాఖ విశ్రాంత ఉద్యో గులు కొర్రపాడు హుస్సేన్‌పీరా, బషీర్ అహ్మద్, రంగ నాయకులు, ఫణి సన్మానించారు.

సూపరింటెండెంట్‌కు సన్మానం

ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్‌ను ఆర్థో విభాగం వైద్యులు మంగ ళవారం ఘనంగా సన్మానించారు. ఇటీవల డాక్టర్ రఘునందన్ అదనపు డీఎంఈ పోస్టుకు నియమితు లైన సంగతి విదితమే. బదిలీపై వెళ్తున్న సూపరింటెం డెంట్ డాక్టర్ రఘునందన్‌కు ఆత్మీయ సన్మానం ఏర్పాటు చేశారు. అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ శ్యాం దర్, డాక్టర్ కోటి సతీష్, డాక్టర్ గౌస్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శాంతిస్వరూప్ పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై కారు బోల్తా

కనగానపల్లి: మామిళ్లపల్లి సమీపంలో జాతీయ రహదారిపై కారు అదుపుతప్పి మంగళవారం బోల్తా పడింది. వివరాలు.. బెంగళూరు నుంచి అనంతపురం కారు అదుపుతప్పి రహదారిపై డివైడ ర్‌ను ఢీకొని బోల్తా పడింది. కారులో ప్రయాణిస్తున్న వారు సురక్షితంగా బయటపడ్డారు.

వాహనాల తనిఖీ

రామగిరి: మండల కేంద్రంలో ఎస్ఐ జనార్దన్‌నా యుడు మంగళవారం వాహనాలను తనిఖీ చేశారు. రికార్డులు లేని వాహనదారులకు అపరాధ రుసుం విధించారు. కర్ణాటక నుంచి ఎవరైనా అక్రమంగా మద్యం తెస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.